# దేవుడు

— కోనేరు రాజబాబు



తనకు పిల్లలు లేని కొరత తీర్చుకొనేందుకు మా అమ్మ ఓ రోజు నన్నీ భూమ్మీద పడేసింది. లేకలేక పుట్టానేమో అమిత గారాబంగా, కష్టమంటే ఏమిటో తెలియకుండాపెంచారు అమ్మా నాన్న

గోరుముద్దలు తినిపించి, పెంచి పెద్దచేసి అయిదో పుట్టినరోజు ఆర్భాటంగా చేసి మేళ తాళాలతో నన్ను ఊళ్ళో ఎలిమెంటరీ స్కూలులో చేర్పించారు—

చేతులరిగేలా అక్షరాలు దిద్దించి "కాకి 'కా' 'కా' అనును"— "ఆవు 'అంబా'! అనును" అని నేర్పించి, దేశానికి ఎల్లలు పటంలో చూపించి నువ్వు గాంధీ — నెహ్రూ అంతటివాడివవుతావని దీవించి, అయిదో తరగతి పాసయ్యావని టి.సి. ఇచ్చారు మా ఊరి పంతులయ్య.

ప్యాంటు వేసుకొని పక్క ఊరికి వెళ్ళి ఫస్టుఫారంలో చేరే అవకాశం వచ్చింది —

కనిష్కుడు చెక్కించిన శిల్పాల గురించీ, అశోకుడు నాటించిన చెట్ల గురించీ, గజనీమహమ్మద్ దండ యాత్రల గురించీ, విజయనగర సామ్రాజ్య పతనాన్ని గురించీ చెప్పి, ప్రపంచ పటంలో విశాల భారతావనిని చూపి, ఇక్కడ నీ చదువు పూర్తయిందని సర్టిఫికేట్ ఇచ్చారు పక్క ఊరి హైస్కూల్ హెడ్ మాస్టరుగారు—

సైకిలు పోయి స్కూటరు వచ్చింది — స్కూలుకు గుడ్‌బై చెప్పి కాలేజీలో చేరాను —

జీతాలు పెంచమని లెక్చరర్ల బంద్, పరీక్షలు ఉండకూడదని విద్యార్థుల ధర్నాలు, నాయకత్వ మార్పు కోసం రాజకీయ నాయకులు సృష్టించిన మతకలహాలతో పోయిన రోజులు పోగా మిగతా రోజుల్లో న్యూటను సిద్ధాంతం గురించీ, వానపాము ఆహార సంపాదన గురించీ, కప్ప సంతానాభివృద్ధి గురించీ చెప్పి ఒక శుభ ముహూర్తాన నీకు డిగ్రీ వచ్చేసిందన్నారు పక్క సిటీ కాలేజీ ప్రిన్సిపాల్‌గారు—

"మాస్టరు డిగ్రీ అంటే మాటలు కాదు — చదువుకోవాలి'' అని చెప్పి వున్న ఊళ్ళో ఒక ఎకరం అమ్మించి, డొనేషను కట్టించుకొని ఇక్కడ ప్రొఫెసర్లు ఉండరు — మీరే చదువుకోవాలని చెప్పి కళ్ళు మూసి తెరిచేలోపు మాస్టరు డిగ్రీ చేతిలో పెట్టారు మరో రాష్ట్రంలోని యూనివర్సిటీవారు.

అందంగా అచ్చుగుద్దిన ఆ సర్టిఫికేట్‌ను ఫేవరేట్ హీరో నటించిన సినిమాలాగా పది సార్లు చూసి ఆనందపడి, కనీసం ఆఫీసరు ఉద్యోగమన్నా రాక పోతుందా అని, అప్లికేషన్లు పెడుతూ, చలానాలు కడుతూ, ఇంటర్వ్యూలకు వెడుతూ రెండేళ్ళు గడిపాను — మరో రెండెకరాలు అమ్మేశాము —

అమ్మ ఒంటి మీద నగలు కరిగిపోయి, ఒంట్లో శక్తి కూడా నశించిపోయింది—

గుమాస్తా ఉద్యోగం కోసం గుమ్మం గుమ్మం తిరుగుతూ మరో ఏడాది గడిచిపోయింది — మరొక ఎకరం అమ్మేశాము.

నాన్నకు 'క్యాన్సరు' అన్నారు —

అవసరాలు పెరిగాయి —

కడుపునింపుకోటానికి కాకపోయినా కన్నవాళ్ళను రక్షించుకొనేందుకు ప్యూను ఉద్యోగమన్నా దొరుకు తుందేమోనని ప్రయత్నాలు మొదలుపెట్టాను—

"నువ్వు పోస్టు గ్రాడ్యుయేట్‌వి" దీనికి పనికిరావన్నారు —

నీకు మంత్రిగారి రికమండేషను లేదన్నారు.

మేము అడిగిన డబ్బు కట్టగలవా?''అన్నారు —

కనీసం నువ్వు ఆడదానివైనా బాగుండేదన్నారు

ఫైవ్‌స్టార్ హోటల్లో పార్టీ ఇవ్వగలవా?'' అన్నారు

ఏదీ చెయ్యలేని నాకు ఉద్యోగం ఇవ్వటానికి ఏ చట్టమూ ఒప్పుకోదన్నారు —

వాళ్ళను సుఖపెట్టలేని నన్ను చూసి అమ్మా — నాన్న జాలిపడి ఓ రోజు ఆత్మహత్య చేసుకున్నారు

మిగిలిన అరెకరం అమ్మేస్తే వాళ్ళ అంత్యక్రియలు, కర్మలు జరిపించి వీటికి కర్తనైన నేను రోడ్డున పడ్డాను—

మాసిన గడ్డం —

మాసిన బట్టలు —

ఆకలి పొట్ట —

ఇవే నా ప్రస్తుత ఆస్తి —

జీవితం మీద విరక్తితో ఓ రోజు ఓ చెట్టు కింద పండుకున్నాను — వికలాంగుడైన ఒక బాలుడు అక్కడికి వచ్చాడు — సుమారు 12 సంవత్సరాలుంటయ్ — వాడి పేరు సత్యమట — చేతిలో ఉన్న పొట్లం ఊడదీశాడు తినటానికి — ఎదురుగా ఉన్న నన్ను చూసి "ఏం! అన్నా! అన్నం తింటావా?'' అన్నాడు —

నేను అప్పటికి భోజనం చేసి వారం రోజులు — తినాలనే ఉంది — కానీ అభిమానం అడ్డు వచ్చింది — తిన్నానని అబద్ధమాడాను — "కనీసం 'టీ' అయినా తాగు''అంటూ పక్క బంకులో ఒక 'టీ' తెచ్చి నాకిచ్చాడు — మరుక్షణంలో ఆత్మీయుడయ్యాడు —

సత్యం ఎన్నో జీవిత సత్యాలను చెప్పాడు —

సోమరిగా బతకకూడదన్నాడు —

కష్టపడి ఏ పని చేసుకున్నా తప్పులేదన్నాడు — పదిమందీ పనికిరావని పారేసే చిత్తు కాగితాలు ఏరుకొని అమ్ముకొని బ్రతుకుతాడట—

మరుసటి రోజు సత్యం నాకు ఒక పాత గోనె సంచీ పెట్టుబడి పెట్టాడు. ఆ రోజు నేనూ చిత్తు కాగితాలు ఏరాను — అందులో ఎంతో మంది పనికిరావని పారేసిన యూనివర్సిటీ వారిచ్చిన సర్టిఫికేట్లున్నాయ్ — కనిష్కుడు చెక్కించిన శిల్పాల గురించి వ్రాసిన గ్రంథాలున్నయ్ — అశోకుడు నాటించిన చెట్ల గురించి జరిపిన పరిశోధనా గ్రంథాలున్నాయ్ — చీటికీ మాటికీ బంద్‌లు జరపమని ప్రజలను రెచ్చగొడుతూ వివిధ రాజకీయ పార్టీలు ప్రజలను రెచ్చగొట్టే కరపత్రాలూ వున్నాయ్

నేను ఏరిన కాగితాలు సత్యమే అమ్ముకొచ్చాడు — మూడు కొత్త పది రూపాయల నోట్లు నా చేతిలో పెడుతూ "ఇదిగో అన్నా — ఈ రోజు నీ సంపాదన'' అన్నాడు—

నా కళ్ళు చెమర్చినయ్ —

ఏ విద్యాసంస్థా నేర్పని పాఠాలు సత్యం నాకు నేర్పాడు! ఏ మహానుభావుడూ చూపని దయాదాక్షిణ్యాలు వాడు నాపై చూపాడు —

వాడికి డిగ్రీలు లేవు — సమాజంలో హోదా లేదు —

కానీ, తోటి మానవుణ్ణి ఆదుకునే మానవత్వం మెండుగా వుంది —

వాడు వికలాంగుడు — కానీ గొప్ప దయామయుడు —

అందుకే వాడే నా దేవుడు! ■